క్లుప్తంగా

బియ్యం నిల్వల పరిశీలన


బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ తేజస్విని తదితరులు

అడ్డతీగల: మధ్యాహ్న భోజన పథకం కింద పాఠశాలలకు పంపిణీ చేయనున్న బియ్యం స్టాక్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్ తేజస్విని బుధవారం పరిశీలించారు. ఈ మేరకు అడ్డతీగలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జీపీఎస్ అనిగేరు పాఠశాలల్లో ఉంచిన సన్న బియ్యం స్టాకు, రికార్డులను తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులకు అందించనున్న బ్యాగ్‌లు, ఇతర వస్తువులను ఎంఈవో పి.శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఆర్ఐ ఎర్రప్ప రెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

పునరావాసం కోసం గిరిజనేతరుల వినతి

వి.ఆర్.పురం: మండలంలోని వడ్డిగూడెం, రాజుపేట, చిన్నమట్టపల్లి పంచాయతీల పరిధిలోని పోలవరం నిర్వాసిత గిరిజనేతరులు బుధవారం పోలవరం ఇరిగేషన్ అడ్మినిస్ట్రేటివ్ కలెక్టర్ అభిషేక్‌ను కలిశారు. తమకు మైదాన ప్రాంతాల్లో పునరావాసం కల్పించాలని కోరుతూ వారు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్టు వారు చెప్పారు.

విద్యార్థులు, తల్లిదండ్రులు విధిగా హాజరుకావాలి


ముంచంగిపుట్టు: విద్యార్థులు, తల్లిదండ్రులు విధిగా పాఠశాల పునఃప్రారంభంలో హాజరుకావాలని హెచ్ఎం ఎం.వి.ఎస్.ప్రకాశ్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా గురువారం విద్యార్థులకు పుస్తకాలు అందించడం, పాఠశాల విద్యా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలలో పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

శాకాహారంతోనే ఆరోగ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

చింతపల్లి: ప్రతి ఒక్కరూ శాకాహారం తీసుకోవడంతో మంచి ఆహారాన్ని పొందవచ్చునని భీమసింగి ఆశ్రమ భక్తులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని పాకలుపాడు గురుదేవులు (భీమసింగి)ఆశ్రమం భక్తులు బుధవారం స్థానిక హనుమాన్ జంక్షన్ నుంచి జిల్లా పరిషత్ అతిథి గృహం, పాత బస్ స్టాండ్ మీదుగా వారపు సంత వరకు శాంతి ర్యాలీ చేపట్టారు. అహింసాయుత శాఖాహారం అవగాహన కల్పించారు. మాంసాహారాన్ని వీడండి.. జీవహింస మానండి.. శాకాహారంతోనే మహా ఆరోగ్యం, ధ్యానంతోనే మనశ్శాంతి అంటూ నినాదాలు చేశారు. భీమసింగి, కొండవంచులు, శరభన్నపాలెం, కొత్తపాలెం, కృష్ణాపురం తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు


దీక్షకు మద్దతు తెలుపుతున్న వైస్ ఎంపీపీ యడమ అర్జున్

చింతూరు: కూటమి ప్రభుత్వం ఏజన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం ప్రకటించాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ ఎదుట చేపట్టిన నిరాహార దీక్షలు బుధవారం నాటికి 27వ రోజుకు చేరుకున్నాయి. మండలంలోని పేగకు చెందిన యువత పాల్గొన్న దీక్షలను వైస్ ఎంపీపీ యడమ అర్జున్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ జేఏసీ నిరాహార దీక్షల్లో భాగంగా చేసిన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. సర్పంచ్‌లు సవలం సత్తిబాబు, పాయం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మాకవరపాలెం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గల దుర్గామల్లేశ్వర దేవస్థానంలో పదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు పూజల్లో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని ఎంపీపీ సర్వేశ్వరరావు, గ్రామ పెద్దలు దర్శించుకున్నారు. అర్చకుడు మల్లికార్జునశర్మ పూజలు చేశారు.

పడకేసిన పారిశుధ్యం

- అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ
- చెత్తతో నిండిపోయిన కాలువలు
- దోమల వృద్ధితో గ్రామస్తులు సతమతం
- పట్టించుకోని యంత్రాంగం


డ్రైనేజీలో పిచ్చిమొక్కలు


గూడెం కాలనీలో డ్రైనేజీ దుస్థితి

గూడెంకొత్తవీధి: మండలంలో పారిశుధ్యం పడకేసింది. రోజుల తరబడి కాలువల్లో చెత్తను తీయకపోవడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రహదారులతో మురుగునీరు, చెత్తచెదారాలు దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దుర్గంధంతో సతమతమవుతున్నారు. వర్షం కురిసినపుడు రహదారులపై అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి లేదు. మురుగునీరు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. దోమలు పెరిగి కంటి మీద కునుకు ఉండడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వ్యాధులు ప్రబలే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వానొస్తే పరిస్థితి మరింత అధ్వానం

గూడెంకొత్తంవీధి మండల కేంద్రంతో పాటు గూడెం కాలనీలోనూ, పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. డ్రైనేజీలో పూడిక తీయక పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. డ్రైనేజీలు చెత్తతో దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ పరమ అధ్వానంగా తయారైంది. వర్షాలు కురవడంతో చెత్త మొత్తం డ్రైనేజీలలో పేరుకుపోయింది. దీని మూలంగా నీరు ప్రవహించడం లేదు.నిల్వ ఉండడంతో లార్వా విపరీతంగా పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థలో మురుగునీరు ముందుగా సాగే విధంగా ఉండాలి.లేకుంటే ఆ ప్రాంతమంతా దోమలు వృద్ధి చెందుతాయి.గూడెంలో ప్రస్తుతం అలాంటి పరిస్థితి నెలకొంది. రోజుల తరబడి పూడిక తీయక డ్రైనేజీల్లో చెత్త విపరీతంగా పేరుకుపోయిందని స్థానికులు చెబుతున్నారు. దీంతో నీరు కదిలే పరిస్థితి లేదంటున్నారు. కొన్నిచోట్ల నీరు వెళ్లినా చెత్త అలానే ఉంటుందని, దీని మూలంగా ఒక వైపున దుర్వాసన వస్తుంటే మరోవైపు దోమలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రయితే దోమల వల్ల కంటిమీద కునుకు ఉండడం లేదని ఆవేదన చెందుతున్నారు. డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు పూడికతీత, చెత్త తొలగింపు పనులు జరగడం లేదని, అధికారుల పర్యవేక్షణ కొరవడిందని స్థానికులు ఆరోపిసుతన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీల్లో పూడికతీతతో పాటు చెత్తచెదారాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

జరగని ఫాగింగ్

దోమల నివారణ కోసం పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలను ఇచ్చినా వాటిని వాడడం లేదు. ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో ఫాగింగ్ చేస్తారు. దీని మూలంగా దోమలు కొంత వరకు తగ్గుతాయి. డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో దోమలు పెరిగిపోతున్నా ఫాగింగ్ కావడం లేదని స్థానికులు చెబుతున్నారు.కొన్ని ప్రాంతాల్లో తూతూ మంత్రంగా ఫాగింగ్ చేపట్టి సిబ్బంది వెళ్లిపోతున్నారని చెబుతున్నారు. దోమల నివారణకు వీలుగా తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.రాత్రయితే నిద్ర కరువవుతుందని వాపోతున్నారు.

పాఠశాలల్లో దోమలమందు పిచికారీ


ముంచంగిపుట్టు పాఠశాలలో దోమల మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న వైద్యులు, సిబ్బంది

ముంచంగిపుట్టు: ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మలేరియా తదితర వ్యాధులు సోకకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మండలంలో కిలగాడ, లబ్బూరు, ముంచంగిపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో వైద్యుల పర్యవేక్షణలో దోమలమందు పిచికారీని బుధవారం చేయించారు. ఈ సందర్భంగా మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి మాట్లాడుతూ మండలంలో ఆశ్రమ పాఠశాలల్లో దోమల వ్యాప్తిని అదుపు చేసేందుకు ముందస్తుగానే మందు పిచికారీ జరిగిందన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో శరవేగంగా ఆశ్రమ పాఠశాలల్లో ఫాగింగ్ పూర్తి చేశామన్నారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్యాధికారులు రమేష్, శిరీష, శ్యాంప్రసాద్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతి


ఇన్‌చార్జి తహసీల్దార్ కుమారస్వామికి వినతి పత్రం ఇస్తున్న ఎంపీపీ తదితరులు

కొయ్యూరు: రోడ్డు ఆక్రమణ పేరుతో దుకాణాలు, గృహాలు తొలగిస్తే బాధితులు సర్వం కోల్పోతారని ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, సర్పంచ్‌లు సోమన్నదొర, పి.సింహాచలం, వర్తక సంఘం నేత మేడిబోయిన చక్రరావు ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి విస్తరణలో భాగంగా చేపడుతున్న పనుల్లో రోడ్డు ఇరువైపులా మొత్తం 30 అడుగుల వరకు ఉన్న ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఈ మేరకు వారు జెడ్పీ అతిథిగృహంలోని ఇన్‌చార్జి తహసీల్దార్ కుమారస్వామిని కలిశారు. రోడ్డు విస్తీర్ణను 30 అడుగులకు పరిమితం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్‌కు వినతిని పంపిస్తామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. భవిష్యత్తులో ఎవరు అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. ఆర్ఐ రాజన్నదొర, వీఆర్వో సత్యనారాయణ, సర్వేయర్లు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

రోలుగుంట : జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల అవరణలో గల టైపు-4 కేజీబీవోల ప్రవేశాలకు 9,10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో చేరేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఇక్కడ ఇటీవల బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయుడు పి.నాగేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో విద్యాశాఖ నిబంధనల మేరకు తల్లి లేదా తండ్రి ఒక్కరే ఉన్న పిల్లలు, మధ్యలో బడి మానేసిన పేద కుటుంబాల పిల్లలకు వారి అర్హతల ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల సిబ్బందిని గాని, 9908035375 ఫోన్ నంబర్లో సంప్రదించవచ్చని సూచించారు.

సామూహిక అక్షరాభ్యాసం


చింతూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న సర్పంచ్ కన్నారావు

రాజవొమ్మంగి: మండలంలోని లబ్బర్తి గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం సందడిగా జరిగింది. మండలంలోని లబ్బర్తి, నెల్లిమెట్ల, లాగరాయి పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరనున్న 25 మంది చిన్నారులచే పురోహితులు రవితేజ శర్మ, ఆంజనేయశర్మ శాస్త్రోక్తంగా విశేష పూజలు జరిపించారు. కార్యక్రమంలో దానధర్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పిల్లలకు పలకలు, బలపాలు, పూజ సామగ్రి సమకూర్చారు. ఎంఈవో సూరయ్యరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు సూరిబాబు, గ్రామస్తులు నాగరాజు, శ్రీను, స్వర్ణలత, రమణ, అప్పలనాయుడు, అంగన్‌వాడీ టీచర్ మంగయమ్మ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చింతూరు: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారుల ఆరోగ్యానికి మంచి పౌష్టికాహారం అందించాలని చింతూరు సర్పంచ్ కారం కన్నారావు అన్నారు. స్థానిక ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారులతో పాటు తల్లులకు కూడా మంచి పౌష్టికాహారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆయన సీడీపీవో విజయగౌరితో కలిసి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

ఎండీయూ వాహనాలు కొనసాగించాలని డిమాండ్


పిత్తమరిగుడలో గ్రామస్తులతో గిరిజన సంఘం నాయకుడు సూర్యనారాయణ తదితరులు

డుంబ్రిగుడ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీ చేసే విధానం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, ఈ విధానంలో ఎండీయూ వాహనాల ద్వారా ఎంతో మందికి ఉపాధి పొందే అవకాశం ఉండేదని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యానారాయణ గుర్తు చేశారు. మండలంలోని కురిపి పంచాయతీ పిత్తమరిగుడ గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో ప్రజలకు రేషన్ అందకపోగా దీనిపై ఆధారపడ్డ వ్యాన్ డ్రైవర్లు, సిబ్బంది ఉపాధి కోల్పోయారని, వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని స్పష్టం చేశారు. డీఆర్ డీపోల ద్వారా రేషన్ సరకులు పంపిణీకి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వల్ల లబ్ధిదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కిల్లోమీటర్ల దూరం వెళ్లి బరువైన రేషన్ సరకులు మోసుకురాలేక వృద్ధులు, దివ్యాంగులు రేషన్ పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఎండీయూ వ్యవస్థ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీ చేసే విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. వార్డు సభ్యులు వి.త్రినాథ, కె.జయరాం, సునిల్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు భూమిపూజ


బైలుగుడలో భూమిపూజ చేస్తున్న సర్పంచ్ హరి, వైస్ ఎంపీపీ ఆనందరావు

డుంబ్రిగుడ: మండలంలోని కంద్రుమ్ పంచాయతీ బైలుగుడ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన భూమి చదును పనులకు సర్పంచ్ హరి, వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు బుధవారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొర్ర పంచాయతీ సర్పంచ్ అర్జున్, వైస్సార్‌సీపీ నాయకుడు చిరంజీవి ఆధ్వర్యంలో శెట్టిబంద గ్రామంలో పశువుల తొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉపాధి పథకం పనులు గిరిజనులను ఆదుకుంటున్నాయన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ వంతల వసంత, ఫీల్డ్ అసిస్టెంట్ సోంగుల దెవకి, పీసా మండల ఉపాధ్యక్షుడు తాంగుల పట్నాయిక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు నల్లకొండమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


నాతవరంలో వెలసిన అమ్మవారు

నాతవరం : గ్రామస్తులు ఆరాధ్య దైవంగా పూజించే నల్లకొండమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం తెల్లవారు నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేద పండితులతో పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. నాతవరం ప్రజలు గ్రామ దేవతగా నల్లకొండమ్మను పూజిస్తుంటారు. అమ్మవారి దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రానుండడంతో ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అందరికీ ఉచితంగా తీర్థప్రసాదాలు అందిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కల్వర్టుకు మరమ్మతు చేయాలి


దెబ్బతిన్న కల్వర్టును పరిశీలిస్తున్న చిన్నాలమ్మ, గ్రామస్తులు

రాజవొమ్మంగి: మండలంలోని మారేడుబాక పంచాయతీలో ఉర్లాకులపాడు నుంచి జి.శరభవరం తదితర గ్రామాలకు వెళ్లే రహదారిపై గల కాజ్‌వే అధ్వానంగా మారిందని మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కోసూరి బుజ్జి చిన్నాలమ్మ చెప్పారు. గ్రామస్తులతో కలిసి పాడైన కాజ్‌వేను ఆమె బుధవారం పరిశీలించారు. రహదారికి వాలుగా గల కొండకాలువపై గతంలో శ్లాబ్ కల్వర్టు నిర్మించారని, కొండ వాగు ఉధృతికి దెబ్బతిందన్నారు. దీంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాగా జి.శరభవరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఇసుక, ఇతర మెటీరియల్ తరలిస్తున్న లారీల కారణంగా బుధవారం ఆ కల్వర్టు మరింత కుంగిపోయిందన్నారు. దీంతో ఈ కల్వర్టు పూర్తిగా శిథిలమవడంతో కోసూరివారివీధి, మేలిన వారివీధి, జి.శరభవరం గ్రామాలకు రాకపోకలు నిలచిపోయినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్నది వర్షాకాలం కావడంతో వాగులు పొంగి ప్రమాదకర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందన్నారు. సమస్యను గ్రామస్తులు పలుమార్లు అధికారులకు తెలియజేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాడైన కల్వర్ట్‌కు త్వరితగతిన మరమ్మతు పనులు చేయించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులతో కలిసి ఆమె కోరారు.

ఐటీడీఏ పీవో దృష్టికి గ్రామ సమస్యలు


ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కు వినతిపత్రం ఇస్తున్న సీతాపురం గ్రామస్తులు

ఎటపాక: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం గ్రీవెన్స్‌లో చింతూరు ఐటిడిఏ పీవో అపూర్వభరత్‌కు వినతిపత్రాలు అందజేశారు. సీతాపురం గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న దుకాణాలు 12 మీటర్ల మేర తొలగించాలని రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారని తెలిపారు.తామంతా పోలవరం నిర్వాసితులుగా ఉన్నామని ప్రతీ ఏడాది వరదలకు రోడ్డు రవాణా మార్గాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తమకు ప్యాకేజీ ఇచ్చి వేరే ప్రాంతానికి తరలించే వరకు రహదారి విస్తీర్ణం పనులు ఆపాలని వినతిపత్రంలో కోరారు.

దీంతో తహసీల్దార్ సుబ్బారావును వివరాలు అడిగి తెలుసుకుని ఎవరికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పీవో ఆదేశించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు గంగాధర్, శ్రీనివాస్,మారాసు నాగేశ్వరరావు తదితరులున్నారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

కన్నాపురం అలుగువాగు ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన గిరిజన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పందా ఆధ్వర్యంలో చింతూరు ఐటిడిఏ పీవో అపూర్వభరత్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టు నిర్వాసిత రైతులకు 2013 భూసేకరణ చట్టప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేతలు కల్పన, సాయన్న, హరిబాబు, సత్తిబాబు, బంగారమ్మ తదితరులున్నారు.

వేణుగోపాలస్వామి ఉత్సవాలు ప్రారంభం

మాడుగుల : పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఆలయ పూజారి వాడపల్లి శ్రీదేవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరగనున్నాయన్నారు. సాయంత్రం ఈ కార్యక్రమంలో పుట్టా మురళీ కృష్ణ, జాగాని లీలావతి, జాగాని పద్మ, లోకేశ్వరి, వాలంకి వరలక్ష్మి, జాగాని వెంకన్న బాబు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు


అనకాపల్లి హిందూ శ్మశాన వాటికలో ఖననం చేస్తున్న దేవా సోషల్ సర్వీస్ ప్రతినిధి తరుణ్, (ఇన్‌సెట్) గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

అనకాపల్లి: అనాథ మృతదేహానికి దేవా సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. యలమంచిలి జాతీయ రహదారిలో రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి (35) మృతదేహాన్ని అక్కడ పోలీసులు కనుగొని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో భద్రపరిచారు. బంధువులెవరూ రాకపోవడంతో పోలీసుల సహకారంతో బుధవారం మృతదేహాన్ని అనకాపల్లి హిందూ శ్మశానవాటికలో ఖననం చేసినట్టు దేవా సోషల్ సర్వీస్ ప్రతినిధి తరుణ్ తెలిపారు.

దెబ్బతిన్న స్లూయిజ్ షట్టర్

- వృథాగా సాగునీరు
- రైతుల ఆందోళన


అప్పలరాజుపేటలో గల వట్టిగెడ్డి రిజర్వాయర్ వద్ద దెబ్బతిన్న మదుమును పరిశీలిస్తున్న రైతులు

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేటలో గల వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో నీరు అడుగంటింది. ఈ రిజర్వాయర్ ప్రధాన స్లూయిజ్‌కు గల షట్టర్ (మదుము తలుపు) రిపేర్ గురయ్యిందని, అయినా సంభందిత మైనర్ ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో రిజర్వయర్‌లోని విలువైన సాగునీరు షట్టర్ రంధ్రాలు, ఖాళీల నుంచి వృథాగా దిగువకు పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాభావ పరిస్థితులు, ఆపై షట్టర్ పూర్తిగా తుప్పుపట్టి పోవడంతో నేడు రిజర్వాయర్ పూర్తిగా ఒట్టిపోయిందని పలువురు రైతులు చెబుతున్నారు. సుమారు ఆరు గ్రామాలకు దాదాపు 3 వేల ఎకరాలకు ఈ రిజర్వాయర్ సాగునీరందిస్తోందని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీరులేని పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిసే సమయానికి అయినా షట్టర్ రిపేరు చేయించాలని, ఖరీఫ్ సాగుకు ఎటువంటి ఆటంకం కలుగకుండా చూడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

వైభవంగా ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు


నాగవల్లి సంబరాల్లో భాగంగా హోమం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో నిర్వహిస్తున్న కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి 15 వ వార్షిక కళ్యాణోత్సవాలు ముగింపు కార్యక్రమం నాగవల్లి సంబరాలు బుధవారం నిర్వహించారు. ఆలయం వద్ద హోమాలు, పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి, చక్రస్నానం, వసంతోత్సవం, స్వామివారికి పూజలు నిర్వహించారు. రాత్రికి ఉంజల్ సేవ, పుష్పాంజలి సేవ, దర్పణదర్శనంతో ఉత్సవాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు, ఉత్సవ కమిటీ కన్వీనర్ కాళ్ల అప్పలనాయుడుతో పాటు మండల విశ్వహిందూ పరిషత్ కోశాధికారి జగ్గారావు, కాళ్ల అచ్చిమినాయుడు, రాముతో పాటు శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.